## సంపాదకీయం

# హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం

**హ**క్కులు అనే భావన తనకు సొంతం అని పాశ్చాత్య దేశాల లిబరల్ సంప్రదాయం భావిస్తుంది. అందువల్ల ఆ తాత్విక సంప్రదాయం హక్కుల భావనను చాలా చర్చించింది. హక్కుల గురించి నిత్యం ఆరాటపడే సగటు జీవికి ఏమీ అర్థంకాని సిద్ధాంత సంవాదం చాలా జరిపింది.

హక్కుల భావన లిబరల్ సంప్రదాయానికి ప్రత్యేకమేం కాదుగానీ, ఆ సంప్రదాయానికి ఉన్న ఒక ముఖ్య లక్షణం హక్కుల చర్చకు చాలా వెసులుబాటు కల్పిస్తుంది. హక్కులు మనిషికి చెందినవి. ఇక్కడ మనిషి అంటే వ్యక్తి అనుకోనక్కరలేదు, ఒక సామాజిక సమూహం కావచ్చు. ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని ప్రాతిపదిక చేసుకున్నట్టే ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని కాక ఏదో ఒక సామాజిక సమూహాన్ని ప్రాతిపదిక చేసుకోవచ్చు. ఉదాహరణకు 'సంఘం పెట్టుకునే హక్కు' అనే దానికి అర్థం ఉండాలంటే కనీసం ఇద్దరు మనుషులుండాలి. ఒకే ఒక వ్యక్తికి 'సంఘం పెట్టుకునే హక్కు' ఉండదు. ఇంకొంచెం లోతయిన అర్థంలో కూడా ఒక హక్కు ప్రతిపాదనకు వ్యక్తి కాక సమూహం ప్రాతిపదిక కాగలదు. ఒక ప్రత్యేకమైన జీవన సరళి, స్థితిగతులు ఉన్న వారి హక్కుల గురించి మాట్లాడేటప్పుడు (ఉదాహరణకు ఆదివాసుల హక్కులు) ఆ ప్రజలను ఒక సమూహంగానే తీసుకొని మాట్లాడతాము. ప్రత్యేకమైన జీవన సరళే ఉండనక్కరలేదు. కేవలం ఆర్థిక లేక సామాజిక స్థితి నిర్వచించే ప్రత్యేకత ఒక సమూహానికి ప్రాతిపదిక కావచ్చు. గుడిసెవాసుల హక్కులు, వినియోగదారుల హక్కులు ఇటువంటివి.

అయితే హక్కుల ప్రతిపాదన వ్యక్తిపరంగా జరిగినా సమూహంపరంగా జరిగినా దాని తాత్విక మూలంలో ఎక్కడో మనిషికి ఒక మనిషిగా విలువనిచ్చే గుణం ఉంది. నీకీ హక్కు ఎక్కడిది అన్నప్పుడు మనిషయి పుట్టాను కాబట్టి అనేది అన్నిటికంటే ఆకర్షణీయమైన జవాబు. ఆ హక్కు వ్యక్తికి చెందినది కావచ్చు (ఉదాహరణకు అభిప్రాయ స్వేచ్ఛ), ఒక సమష్టికి చెందినది కావచ్చు (శ్రామికులకు కనీస వేతనం, శుభ్రమైన పర్యావరణం మొదలయినవి).

అందువల్లనే మనిషిని మనిషిగా కేంద్రం చేసుకునే తాత్విక గుణం గల లిబరల్ సంప్రదాయం హక్కుల భావనను తనదిగా భావించి దాని విశదీకరణ కోసం చాలా చర్చ జరిపింది.

అయితే చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే హక్కుల ఉద్యమాలకూ ఈ హక్కుల సిద్ధాంత చర్చకూ ఏమీ సంబంధం లేకుండా దేనిపాటికది సాగుతుండడం. పాశ్చాత్య దేశాలలో సహితం హక్కుల ఉద్యమం లిబరల్ తాత్విక సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదంతో పెద్దగా సంబంధం లేకుండా ఒక ప్రాక్టికల్ కార్యక్రమంగా సాగిపోతుంటుంది. మూడవ ప్రపంచ దేశాలలో చాలా క్లిష్టమైన హక్కుల పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టిన ఉద్యమాలయితే అటువంటి తాత్విక చర్చ ఒకటి ఉందన్న స్పృహ లేకుండానే నడుస్తున్నాయి.

దీనికి చాలా కారణాలున్నాయి. మనబోటి దేశాలలో హక్కుల ఉద్యమాలు ఒక బలమైన అవసరం నుండి పుట్టాయి. ఆ అవసరాన్ని తీర్చే నిత్య కార్యక్రమంలో నిమగ్నమయి ఉంటాయి. దానికి చట్టం పనికొస్తే చట్టాన్ని వాడుకుంటాయి. కోర్టులు అక్కరకొస్తే కోర్టులను వాడుకుంటాయి. ప్రచారం, ఆందోళన, లాబీయింగ్, ఏది ఉపయోగకరమనుకుంటే అది చేస్తాయి. దీనికి లోతయిన తాత్విక సంవాదం అసలు అవసరమా అన్న పద్ధతిలో సాగుతుంటాయి.

ఇదొక కారణం కావచ్చు.

ఇంకొక కారణం, మూడవ ప్రపంచ దేశాలలోని హక్కుల ఉద్యమాల ప్రాపంచిక దృక్పథం ఎక్కువ భాగం ఏదో ఒక అర్థంలో రాడికల్ దృక్పథం. ప్రస్తుత సమాజాన్ని అదొక గడచిపోతున్న సామాజిక దశగా అర్థం చేసుకుంటుంది. పాశ్చాత్య లిబరల్ దృక్పథం ఇవ్వాళ్టి సమాజాన్నే శాశ్వతం అనుకున్నా అనుకోకున్నా, అది ఈ సమాజంలోనే నిలబడి దానివైపే చూస్తూ ఆలోచిస్తుంది. రాడికల్ దృక్పథాలు ఇవ్వాళ్టి సమాజంలో నిలబడి రేపటి సమాజంగా భావించే దానివైపు చూస్తూ ఆలోచిస్తాయి. ఈ తేడా వల్ల హక్కులను చూసే పద్ధతిలో చాలా తేడా వస్తుంది.

అది కూడా కారణం కావచ్చు.

అయితే అంతకంటే మౌలికమైన సమస్య ఉందేమో అనిపిస్తుంది. మౌలిక అనే భావనను 'సమానత' అనే భావన అంటిపెట్టుకొని ఉంటుంది. ఇది నా హక్కు అని ఎవరు ఎవరితో అన్నా అక్కడ నీకంటే నేనేం తక్కువకాదు అనే ధ్వని తప్పనిసరిగా ఉంటుంది. సమానత్వ భావన హక్కుల భావనలో అంతర్లీనమయినది.

ఇది లిబరల్ సంప్రదాయాన్ని చాలా ఇబ్బంది పెడుతుంది. ఆ సంప్రదాయం సమానత్వం అనే ఆలోచనను చాలా సమస్యాత్మమైనదిగా భావిస్తుంది. చట్టం ముందు సమానత్వాన్ని మాత్రమే నిర్ద్వంద్వంగా అంగీకరిస్తుంది. వేరే ఏ అర్థంలో సమానత్వాన్ని ప్రతిపాదించినా అడుగడుగూ తటపటాయిస్తుంది.

కానీ హక్కుల ఉద్యమం సమానత్వాన్ని చాలా సహజమైన భావనగా స్వీకరిస్తుంది. హక్కుల

భావనతో విడదీయరానిదిగా ఏ ఇబ్బందీ లేకుండా గుర్తిస్తుంది. సమానత్వాన్ని వ్యవస్థీకరించడం, అమలులోకి తీసుకురావడం, ఆచరించడం ఎంత మాత్రం సులభం కాదన్న స్పృహ హక్కుల ఉద్యమానికి లేకపోలేదు. ఒకనాడు దీనిని తేలికగా తీసుకొని ఉన్నా, ఇవాళ తీసుకోవడం సాధ్యంకాదు. సమానత్వం అనేది ఎంత ఆకర్షణీయమైన భావనో దానిని ఆచరణలోకి తీసుకు రావడం అంత కష్టతరం అనేది ఇరవయ్యవ శతాబ్దం నేర్పిన ప్రధాన గుణపాఠం. దానిని విస్మరించే ప్రగతిశీలక ఉద్యమమేదీ ముందుకు పోలేదు. అయినప్పటికీ సూత్రప్రాయంగా హక్కులంటే సమానత్వం అని ఒప్పుకోవడానికి హక్కుల ఉద్యమం సంశయించదు.

లిబరల్ సంప్రదాయంలో విస్తారంగా జరుగుతున్న హక్కుల సిద్ధాంత చర్చ మూడవ ప్రపంచ దేశాల హక్కుల ఉద్యమాలను పెద్దగా ఆకర్షించకపోవడానికి ఇది బలమైన కారణం కావచ్చు.

అయినప్పటికీ దానిని అసలే పట్టించుకోకుండా సాగిపోవడమూ సరయినది కాదు. ఇందుకు మూడు కారణాలున్నాయి. అడ్డగోలు వాదనలు విడిచిపెట్టి తర్కబద్ధంగా వాదించడం నేర్చుకోవడా నికి లిబరల్ సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదం ఉపయోగపడుతుంది. రెండవది, హక్కుల మధ్య ఘర్షణను సీరియస్‌గా తీసుకోవడం నేర్పుతుంది. ఒకరి మేలు కోసం మరొకరి ప్రాణం తీయవచ్చు అన్న దగ్గర మొదలుపెట్టి ఒకరి బాగుకోసం మరొకరి పైన నిర్బంధం పెట్టవచ్చు, ఒకరి పురోగమనం కోసం మరొకరి అవకాశాలు కుదించవచ్చు, మొదలయినవన్నీ హక్కుల మధ్య ఘర్షణకు సంబంధించిన సమస్యలు. ఈ సమాజంలో నిలబడి వేరే సమాజం వైపు చూసే దృక్పథం కంటే ఈ సమాజం మీద దృష్టిపెట్టే దృక్పథమే ఈ సమస్యలను లోతుగా అధ్యయనం చేయగలుగు తుంది. మూడవది, హక్కుల ప్రతిపాదనకు వ్యక్తి ప్రాతిపదిక అనుకున్నా ఒక సమూహం ప్రాతిపదిక అనుకున్నా మనిషికి మనిషిగా విలువనిచ్చే గుణం – మానవతావాదానికి పునాదిప్రాయమైన గుణం – హక్కుల దృక్కోణానికి చాలా అవసరం. లేకపోతే మనిషి మరిదేనికో సాధనం అయిపోయే ప్రమాదం ఉంది.

ఈ మేరకు లిబరల్ తాత్విక సంప్రదాయం నుండి స్వీకరిస్తూ, సమానత్వాన్ని ప్రాతిపదిక చేసు కున్న హక్కుల దృక్కోణాన్ని తాత్వికంగా బలోపేతం చేసే కృషి అవసరం. హక్కుల ఉద్యమానికి తన దంటూ ఒక కర్తవ్యం, కార్యరంగం ఉన్నాయనుకుంటేనే ఇది సాధ్యం అని వేరే చెప్పనవసరం లేదు. హక్కుల ఉద్యమాన్ని కేవలం రాజకీయ కాలక్షేపంగా చూసే దృష్టి ఏ తాత్విక దృక్పథాన్నీ పెంపొం దించలేదు.

**–మానవహక్కుల వేదిక**

మేడే, 2005